సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 30 । జూలై । 2025



చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.44
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.44, కనిష్టంగా రూ.30 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,450 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
32.4°/21.6°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 15 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

కాంట్రాక్ట్‌ల కోసం దాడులు చేస్తారా?

- టీడీపీ నాయకుల చర్యలతో పారిశ్రామిక వర్గాల్లో భయాందోళన
- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పెనుకొండ రూరల్‌: టీడీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకూ పెచ్చు మీరిపోతున్నాయని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌ మండిపడ్డారు. కాంట్రాక్ట్‌ల కోసం ఏకంగా దాడులకు దిగడం రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు అద్దం పడుతోందన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ‘కియా’ అనుబంధ పరిశ్రమల్లో కాంట్రాక్ట్‌ పనుల కోసం మంత్రి సవిత అనుచరులు దౌర్జన్యాలకు పాల్పడటం దారుణమన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమల సంగతేమో గానీ.. టీడీపీ నేతల రౌడీయిజంతో ఉన్న పరిశ్రమలు కూడా పోయేలా ఉన్నాయన్నారు. పరిగి మండల కేంద్రంలో వందల మందికి ఉపాధి కల్పిస్తున్న ఫ్రీ కాట్‌ మిల్లు మూతపడినా... ప్రభుత్వం స్పందించలేదన్నారు. జౌళి పరిశ్రమ శాఖ మంత్రి సవిత కూడా ఎలాంటి శ్రద్ధా చూపడం లేదన్నారు. ‘కియా’ అనుబంధ పరిశ్రమల్లో కాంట్రాక్ట్‌ పనుల కోసం మంత్రి అనుచరులు వరుసగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం చూస్తుంటే పెనుకొండ ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు కూడా ఇతర ప్రాంతాలకు తరలిపోయే పరిస్థితులు కన్పిస్తున్నాయన్నారు.

పురిట్లోనే ‘పిండం’!



ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా అబార్షన్లు

- ఏటా 9 వేలకు పైగా జరుగుతున్నట్లు ఆరోపణలు
- 80 శాతం అబార్షన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే
- ప్రైవేటు నర్సింగ్‌ హోంలలో ఇష్టారాజ్యం
- ఐదోనెల గర్భం దాటినా అబార్షన్‌ చేస్తున్న వైనం

డయాగ్నస్టిక్స్‌ సెంటర్లపై చర్యలిలా

- లింగ నిర్ధారణ జరిగినట్టు తేలితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా.
- వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టరు రిజిస్ట్రేషన్‌ రద్దు లేదా సస్పెండ్‌ చేస్తారు.
- లింగ నిర్ధారణ చేశారని తెలిసి, అబార్షన్‌ చేసిన గైనకాలజిస్ట్‌కు బెయిలు లేని మూడేళ్ల జైలు.
- డయాగ్నస్టిక్‌ సెంటర్‌ను మూసేయడంతో పాటు రిజిస్ట్రేషన్‌ రద్దు చేస్తారు.
- బాధ్యులైన వైద్యులపై క్రిమినల్‌ కేసు నమోదు చేస్తారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అబార్షన్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. చిన్న చిన్న కారణాలకూ అబార్షన్‌ చేయడం సర్వసాధారణమైపోయింది. చట్టాలు కఠినంగా ఉన్నా లింగనిర్ధారణ చేయిస్తూ కడుపులోని బిడ్డ బాలిక అని తెలియగానే పురిట్లోనే ‘పిండం’ పెడుతున్న దుస్థితి నెలకొంది. అత్యంత పకడ్బందీగా, గుట్టుగా భ్రూణ హత్యలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. పీసీపీఎన్‌డీటీ (ప్రీ కన్సెప్షన్‌ అండ్‌ ప్రినేటల్‌ డయాగ్నస్టిక్స్‌ టెక్నిక్స్‌) చట్టం ఉన్నా.. అమలు, పర్యవేక్షణ సరిగా లేకపోవడం అనధికారిక అబార్షన్లకు కారణమని తెలుస్తోంది. డయాగ్నస్టిక్స్‌ సెంటర్లతో వైద్యాధికారులు కుమ్మక్కై తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వ్యాపారంలా..

జిల్లాలో రేడియో డయాగ్నస్టిక్స్‌ సెంటర్లలో యథేచ్ఛగా లింగనిర్ధారణ జరుగుతున్నట్టు సమాచారం. గైనకాలజిస్ట్‌లు, రేడియాలజిస్ట్‌లు కలిసి వ్యాపారంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. చట్టం కఠినంగా ఉన్నా అమలు సరిగా లేని కారణంగా కొన్ని ప్రైవేటు డయాగ్నస్టిక్స్‌ సెంటర్లు ఏ మాత్రం భయపడకుండా అక్రమ వ్యాపారం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా 65వేల మందికి పైగా గర్భం దాలుస్తున్నారు. అందులో రకరకాల కారణాల వల్ల 9 వేల వరకూ అబార్షన్లు జరుగుతున్నట్టు అంచనా.

తల్లికి ప్రాణాపాయం ఉంటేనే..

కడుపులో ఉన్న బిడ్డ వల్ల తల్లికి ప్రాణాపాయం ఉందని భావిస్తేనే అబార్షన్‌ చేయాలి. అదికూడా గర్భం ధరించిన 5 నెలల్లోనే చేయాలని చట్టం చెబుతోంది. కానీ చాలామంది ఐదో నెల దాటినా అబార్షన్‌ చేయించుకుంటున్నారు. బిడ్డ ఎదుగుదల సరిగా లేదనో, మరేవో కారణాలతో ఆరో నెలలో కూడా అబార్షన్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇలాంటి అబార్షన్‌కు రూ.15 వేలకు పైగా తీసుకుంటున్నట్టు తెలిసింది. ప్రతి అబార్షన్‌ను ఎందుకు చేశామన్నది వైద్య ఆరోగ్యశాఖకు వివరాలు ఇవ్వాలి. కానీ అలా చేస్తున్న నర్సింగ్‌హోం జిల్లాలో ఒక్కటీ లేదు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



అబార్షన్‌ కారణంగా తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ముందస్తు ప్రణాళిక లేకుండా అబార్షన్‌ చేయించుకుంటే రక్తహీనత ఏర్పడి ప్రాణం మీదకు వస్తుంది. ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశమూ లేకపోలేదు. భవిష్యత్తులో మళ్లీ ప్రెగ్నెన్సీ వచ్చినా గర్భసంచి, ట్యూబ్స్‌, అండాశయానికి ఇన్‌ఫెక్షన్లు వచ్చి అబార్షన్‌ అయ్యే అవకాశం ఉంది. అర్ధంతరంగా అబార్షన్‌ చేయించుకుంటే మళ్లీ గర్భం దాల్చే అవకాశాలు తక్కువవుతాయి.

– డాక్టర్‌ షంషాద్‌బేగం, గైనిక్‌ విభాగం హెచ్‌ఓడీ, అనంతపురం సర్వజనాస్పత్రి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2024-25 సంవత్సరం గణాంకాలు..

అనంతపురం జిల్లాలో గర్భిణుల రిజిస్ట్రేషన్‌	37,167
ఏటా జరుగుతున్న అబార్షన్లు (సగటున)	5,575
శ్రీ సత్యసాయి జిల్లాలో గర్భిణుల రిజిస్ట్రేషన్‌	27,964
ఏటా జరుగుతున్న అబార్షన్లు (సగటున)	4,194

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

- ఆర్టీసీ అధికారులకు కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ ఆదేశం



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌

ధర్మవరం అర్బన్‌: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ ఆదేశించారు. మంగళవారం ఆయన ధర్మవరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌ పరిసరాలతో పాటు టికెట్‌ కౌంటర్లు, సైకిల్‌స్టాండ్‌, తినుబండారాల దుకాణాలు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం, గ్యారేజీలను పరిశీలించారు. బస్టాండ్‌ను మరింత పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. తాగునీరు అందుబాటులో ఉంటోందా.. నిర్ణీత సమయానికి బస్సులు వస్తున్నాయా, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంటున్నాయా అంటూ ప్రయాణికులను ఆరా తీశారు. అనంతరం బస్సుల మైలేజీ గురించి అధికారులతో ఆరా తీశారు. కలెక్టర్‌ వెంట ఆర్డీఓ మహేష్‌, తహసీల్దార్‌ సురేష్‌బాబు, ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్‌ సికిందర్‌, సమాచారశాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతుల సమక్షంలోనే రీ సర్వే చేయాలి

ధర్మవరం రూరల్‌: రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పోతులనాగేపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ.. రైతు కుటుంబ సభ్యుల సమక్షంలోనే భూమిని రీ సర్వే చేయాలన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. కలెక్టర్‌ వెంట ఆర్డీఓ మహేష్‌, సమాచార శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్‌ సురేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.

యూరియా.. లేదయా!

- ఆర్‌ఎస్‌కేల్లో నో స్టాక్‌
- రైతులను పిండుకుంటున్న ఫర్టిలైజర్‌ షాపుల నిర్వాహకులు
- యూరియా కోసం వెళితే డీఏపీ, కాంప్లెక్స్‌ అంటగడుతున్న వైనం



పెడపల్లి ఆర్‌ఎస్‌కేలో స్టాకు లేని దృశ్యం

పుట్టపర్తి అర్బన్‌: రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. సాగునీటి లభ్యత ఉన్న రైతులు ఖరీఫ్‌లో మొక్కజొన్న, వరి పంటలు సాగు చేశారు. ఈ రెండు పంటలకు యూరియా ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇక ఇతర పంటలకూ రైతులు యూరియా వినియోగిస్తారు. సీజన్‌ ప్రారంభంలోనే పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకోలేదు. దీనికి తోడు నానో యూరియా అంటూ బస్తాల్లో వచ్చే యూరియాను అందుబాటులో లేకుండా చేసింది. దీంతో యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అంచనా తప్పిన అధికారులు

జిల్లాలో 6,640 హెక్టార్లలో మొక్కజొన్న, 276 హెక్టార్లలో వరి సాగు చేశారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. క్రాప్‌ బుకింగ్‌ చేసే సిబ్బంది లేకపోవడంతో చాలా మంది రైతుల పంటలు రికార్డుల్లోకి ఎక్కలేదు. అందువల్ల సాగు విస్తీర్ణం అధికారుల లెక్కకు మించి ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా జిల్లాలో 6,396 హెక్టార్లలో వరి, 18 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగులోకి వస్తుంది. ఈ మేరకు అధికారులు ఎరువులు అందుబాటులో ఉంచాల్సి ఉంది. కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం.. ప్రజాప్రతినిధులు రైతుల గురించే ఆలోచించకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఫలితంగా జిల్లాలో యూరియా నిల్వలు నిండికుని రైతులకు కష్టాలు మొదలయ్యాయి.

ప్రైవేటు మార్కెట్‌లో అధిక ధరలు

ప్రస్తుతం జిల్లాలో యూరియా డిమాండును దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. 50 కిలోల యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.267 ఉండగా... మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు. ప్రస్తుతం అధిక ధర ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తున్నా...స్టాకు లేదని చెబుతున్నారు. మొక్కజొన్న రైతులు ఫర్టిలైజర్‌ షాపులకు వెళ్తే కత్తెర పురుగుకు గుళికలు తీసుకోవాలని, వరి రైతులు వెళ్తే.. వరి పిలకలు వచ్చేందుకు ఎరువులు తీసుకోవాలని అవసరం లేని వాటినీ అంటగడుతున్నారు. వీటితో పాటు డీఏపీ, కాంప్లెక్స్‌ ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తాంటూ మెలిక పెడుతున్నారు. వీటిని తీసుకోని రైతులకు యూరియా లేదని వెనక్కు పంపుతున్నారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు

- కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్‌ తొలి వారంలో యూరియా 9,508 టన్నులు ఉండేదని, అదనంగా 2,880 టన్నులు వచ్చిందన్నారు. ఇందులో 6,680 టన్నులు విక్రయించగా, ఇంకా 3,758 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే డీఏపీ ఎరువులు జూన్‌ తొలివారంలో 1,531 టన్నులు ఉండగా, 1,156 టన్నులు అదనంగా జిల్లాకు వచ్చిందన్నారు. మొత్తంగా 2,687 టన్నుల డీఏపీ ఎరువుల్లో 597 టన్నులు విక్రయించగా, ప్రస్తుతం 2,090 టన్నుల స్టాకు నిల్వ ఉందన్నారు. కాంప్లెక్స్‌ ఎరువులు కూడా 4,889 టన్నులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఖరీఫ్‌ జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2,69,000 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 52,000 హెక్టార్లలోనే పంటలు సాగులోకి వచ్చాయన్నారు.

లైంగిక వేధింపులపై మహిళాగ్రహం



బాధితురాలు, మహిళలతో కలిసి హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు



హిందూపరం అంబేడ్కర్‌ సర్కిల్‌లో బాధిత మహిళతో కలిసి రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న దీపిక, మధుమతి, మహిళలు

- టీడీపీ నేత చింటు దుర్మార్గంపై మహిళల ధ్వజం
- వైఎస్సార్‌ సీపీ ఆధ్వర్యంలో పురంలో భారీ ర్యాలీ, ధర్నా
- బాధితురాలితో కలిసి పాల్గొన్న టీఎన్‌ దీపిక, మధుమతిరెడ్డి
- చింటుపై కేసు నమోదు చేసి అరెస్ట్‌ చేయాలని డిమాండ్‌

చిలమత్తూరు: అధికార అండతో టీడీపీ నేతలు చేస్తున్న దాష్టీకాలపై మహిళాలోకం కన్నెర్ర చేసింది. బాలకృష్ణ ప్రాతినిథ్యం వహిస్తున్న హిందూపురంలో టీడీపీ నేత యుగంధర్‌ అలియాస్‌ చింటు లైంగిక వేధింపులపై మహిళాగ్రహం పెల్లుబుకింది. మంగళవారం వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్‌ దీపిక ఆధ్వర్యంలో బాధితురాలితో కలిసి మహిళలంతా రోడ్డెక్కారు. పట్టణంలోని అంబేడ్కర్‌ సర్కిల్‌లో వందలాది మంది వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు, మహిళలు, మైనార్టీలు బాధిత మహిళతో కలిసి భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ధర్నా నిర్వహించారు. చింటు, అతని అనుచరులను అరెస్ట్‌ చేయాలని నినదించారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ, హోంమంత్రి అనిత, సీఐ రాజగోపాల్‌నాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌ దీపిక, పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డిపై మహిళా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ధర్నా చేయకూడదంటూ వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌ సీపీ శ్రేణులు, మహిళలు ఎదురు తిరగడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. అనంతరం వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ చేపట్టారు.

పని అడిగితే కమిటిమెంట్‌ అడుగుతారా..?

ర్యాలీ సందర్భంగా వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్‌ దీపిక మాట్లాడారు. నియోజకవర్గంలో మహిళలను ఉద్యోగాల నుంచి తొలగించడం, తిరిగి పని అడిగిన వారిని కమిట్‌మెంట్‌ అడగడం ఎంత దుర్మార్గమన్నారు. మహిళలను లైంగికంగా వేధిస్తున్న టీడీపీ నేతలను ఎమ్మెల్యే బాలకృష్ణ, ఆయన పీఏలు ప్రోత్సహిస్తున్నారా... అని ఆమె ప్రశ్నించారు. హిందూపురంలో ఎమ్మెల్యే సతీమణి వసుంధర పర్యటిస్తే మహిళలను వేధించిన చింటుతో ఆమెకు బొకే ఇప్పించడం చూస్తే అతనికి ఇచ్చిన ప్రాధాన్యం తెలుస్తోందన్నారు. ఒక ఆడబిడ్డకు అన్యాయం చేస్తూ ఆమె బతుకు తెరువుపైకొట్టడం, ఆ మహిళను పక్కలోకి రమ్మంటూ నీచమైన ఆలోచనలు చేస్తున్న టీడీపీ నాయకులపై ఆ పార్టీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. బాధిత మైనార్టీ మహిళకు వైఎస్సార్‌ సీపీ తోడుగా ఉంటుందన్నారు. ఇక వన్‌ టౌన్‌ సీఐ రాజగోపాల్‌నాయుడు తీరు మార్చుకోవాలన్నారు. లైంగిక వేధింపులకు గురైన మహిళ పేరు, ఊరు ప్రస్తావిస్తూ ఆయన ఓ వీడియో రూపొందించి దాన్ని సోషియల్‌ మీడియాలో పెట్టడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. మహిళ భద్రత, రక్షణ అంశాలను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా ఓ బాధ్యత కలిగిన పోలీసు అధికారి మాట్లాడటాన్ని ఆమె ఖండించారు. సీఐ తీరుపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

మహిళను లైంగికంగా వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని వైఎస్సార్‌ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి డిమాండ్‌ చేశారు. హిందూపురంలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయని, కనీసం మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కవితారెడ్డి, ఎంపీపీ రత్నమ్మ, పార్టీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎన్‌ఏ శివ, మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ అసిఫుల్లా, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బలరామిరెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, వైఎస్సార్‌ సీపీ రూరల్‌ మండల కన్వీనర్‌ రాము, లేపాక్షి మండల కన్వీనర్‌ సయ్యద్‌ నిస్సార్‌, వైస్‌ ఎంపీపీ అంజన్‌రెడ్డి, సహేరాభాను, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, శబరీష్‌రెడ్డి, ప్రణయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీరాములు, మైనార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చరిత్ర పాఠ్యాంశ నిపుణుల కమిటీలో రాజ్‌మహమ్మద్‌కు చోటు


ఉన్నత విద్యా మండలి జారీ చేసిన పత్రాన్ని అందుకుంటున్న రాజ్ మహమ్మద్

పుట్టపర్తి: బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న చరిత్ర అధ్యాపకులు రాజ్ మహమ్మద్‌కు అరుదైన గౌరవం దక్కింది. చరిత్ర పాఠ్యాంశ ప్రణాళికను రూపొందించే నిపుణల కమిటీలో ఆయనకు స్థానం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాశాఖ చైర్మన్ మధుమూర్తి పర్యవేక్షణలో ఈ కమిటీ పని చేస్తోందని రాజ్ మహమ్మద్ మంగళవారం తెలిపారు. రాజ్ మహమ్మద్ ఎంపికపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ మగ్బూల్ హుస్సేన్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

'ఫోరం'లో సీనియర్ టీచర్లకు ప్రాధాన్యతనివ్వాలి

- స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: మండల అకడమిక్ మానిటరింగ్ ఫోరం సభ్యులుగా సీనియర్ టీచర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతీప్రసాద్, జయకృష్ణ, వర్కింగ్, అసోసియేట్ ప్రెసిడెంట్స్ నరేష్‌కుమార్, మక్కిశెట్టి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల ఎంపికలో కొందరు ఎంఈఓల తీరును వారు ఆక్షేపించారు. సీనియర్లను విస్మరించి ఇష్టారాజ్యంగా తమకు నచ్చినవారిని, అనుకూలమైన వారిని మండల అకడమిక్ ఫోరం కమిటీలోకి తీసుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులతో చర్చించకుండా ఉపాధ్యాయుల పేర్లు పంపడం సరైంది కాదన్నారు. మండలాల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీనియర్ ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మండల అకడమిక్ ఫోరం సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పోస్టుల పని భారం పెరిగినందున గ్రేడ్-1 ప్రధానోపాధ్యాయ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసి ఆఫీస్ సిబ్బందిని కూడా నియమించాలని కోరారు.

హిందూపురంలోని పారిశ్రామిక వాడలో వెలసిన ఫార్మా కంపెనీల వ్యర్థాలతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. పరిశ్రమల్లోని విషపూరితరసాయనాల వ్యర్థాలను తరలించే బాధ్యత తీసుకున్న కూటమి నేతలు.. వాటిని ఎక్కడ పడితే అక్కడ డంప్ చేస్తున్నారు. ఫలితంగా భూ ఉపరితలంతో పాటు అంతర్భాగమూ కలుషితమవుతోంది. ఇప్పటికే తాగునీరు కలుషితమై ప్రజలు పలు చర్మ సంబంధిత వ్యాధులతో సతమతమవుతున్నారు.


సాగునీటి కాలువలో పడేసిన రసాయనిక వ్యర్థాలతో రంగుమారిన భూ ఉపరితలం

కెమికల్ వ్యర్థాలు.. కాలుష్య కష్టాలు!

రసాయనిక వ్యర్థాలతో కలుషితమవుతున్న హిందూపురం పారిశ్రామిక వాడ

- చెరువులను తలపిస్తున్న ఫార్మా వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడలోని ఫ్యాక్టరీలలో కెమికల్ వ్యర్థాలను సాగునీటి కాలువల్లో వదిలేశారు. అక్కడితో ఆగకుండా రాత్రి సమయాల్లో ట్యాంకర్ల ద్వారా రసాయనిక వ్యర్థాలను తరలించి బయలు ప్రదేశంలో పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా చెరువులను తలపిస్తోంది. పరిసరాల్లో చెట్లు మాడిపోతున్నాయి. ఆ ప్రాంతాల్లో ఘాటైన దుర్గంధం వ్యాప్తి చెందడంతో చుట్టుపక్కల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు.

ఆ రెండు పరిశ్రమల్లోనే అత్యధికం..

తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడలోని రెండు ఫార్మా కంపెనీల నుంచి ఎక్కువగా కెమికల్ వ్యర్థాలు బయటకు వస్తున్నట్లు సమాచారం. వీటిని రీసైక్లింగ్ చేయాల్సిన యాజమాన్యం.. ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికి తోడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిశ్రమల్లోని కెమికల్ వ్యర్థాలను తరలించే బాధ్యతను ఓ టీడీపీ నేత తీసుకున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.50 వేలు చొప్పున యాజమాన్యాలు చెల్లిస్తున్నట్లుగా సమాచారం. అయితే అధికారం అండ చూసుకుని సదరు నేత కెమికల్ వ్యర్థాలను పక్కనే ఉన్న సాగునీటి కాలువల్లో పారబోస్తుండడంతో ఆ ప్రాంతమంతా చెరువులను తలపిస్తున్నాయి.

కలుషితమవుతున్న భూగర్భ జలం..

తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామిక వాడల్లో ఆరు వరకూ కెమికల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిలో ఫార్మా కంపెనీలు అతి పెద్దవి. ఈ పరిశ్రమల నుంచే ఎక్కువగా కెమికల్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు తెలుస్తోంది. ఆరు బయట పడేసిన రసాయనిక వ్యర్థాలు భూగర్భంలోకి ఇంకడం వల్ల వ్యవసాయ బోర్లు, పంచాయతీ బోరుబావుల్లోని నీరు కలుషితమవుతోంది. ఈ బోరుబావుల్లో నీటిని తాగడం వల్ల పలు చర్మ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. అయితే ఈ విషయంపై సదరు కంపెనీ ప్రతినిధులను 'సాక్షి' నేరుగా కలిసి వివరణ కోరగా... ఆ వ్యర్థాలు తమ పరిశ్రమకు చెందినవి కాదని బుకాయించారు. పొరుగున ఉన్న కర్ణాటకలోని పరిశ్రమల నిర్వాహకులు ఇక్కడకు తెచ్చి పడేస్తున్నారంటూ సమాధానం దాటవేశారు.

నీరు కలుషితం అవుతోంది



ఫార్మా కంపెనీలు ఇష్టారీతిన బయట పడేస్తున్న రసాయన వ్యర్థాలు మా కంపెనీ లోతట్టు ప్రాంతంలోకి చేరుతున్నాయి. చెరువును తలపించేలా రసాయనాలు నిండుకున్నాయి. వేలాదిగా మొక్కలు నాటి పెంచుతున్నాం. ఈ రసాయనాల దెబ్బకు చెట్లు చనిపోతున్నాయి. మా పరిశ్రమలో పనిచేస్తున్న కూలీలు అనారోగ్యానికి గురవుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మా పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించేలా యజమానితో మాట్లాడతాం.

– రాకేష్, మేనేజర్, శ్యామ్ ఫెర్రస్ స్టీల్ పరిశ్రమ, తూముకుంట

చర్యలు చేపడతాం

రసాయన వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడేస్తే ఉపేక్షించం. ఇరిగేషన్ కాలువల్లో వ్యర్థాలను పారబోస్తున్నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. దీనిపై విచారణ చేపడతాం. శ్యాంపిల్స్ సేకరించి చర్యలు తీసుకుంటాం. ఫార్మా కంపెనీల ఆగడాలను అడ్డుకుంటాం.

– మునిప్రసాద్, ఈఈ, పొల్యూషన్ బోర్డు, అనంతపురం

పోలీసుల అదుపులో నలుగురు వడ్డీ వ్యాపారులు

- న్యాయవాది ద్వారా లొంగిపోయిన వైనం

ధర్మవరం అర్బన్: అధిక వడ్డీలు వసూలు చేస్తూ పట్టణంలోని శాంతినగర్‌లోని రమణ, భారతి దంపతులపై దాడికి పాల్పడిన వడ్డీ వ్యాపారుల నలుగురు మంగళవారం న్యాయవాది ద్వారా స్టేషన్‌లో లొంగిపోయారు. వడ్డీ వ్యాపారులు రమణ ఇంట్లో చొరబడి దాడి చేసిన వీడియో రాష్ట్రంలోనే సంచలనం రేపింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఇప్పటికే ధర్మవరం టూ టౌన్ సీఐ రెడ్డప్ప ఏడుగురిపై కేసు నమోదు చేశారు. దాడి ఘటన తర్వాత నిందితులు పరారీలో ఉండగా.. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వారి కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు నిందితులు మంగళవారం ఓ న్యాయవాది ద్వారా డీఎస్పీ కార్యాలయంలో లొంగిపోయారు. వారి నుంచి పోలీసులు సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. ఎవరెవరికి ఎంత డబ్బులు ఇచ్చారు...? ఎవరితో ఎక్కువ డబ్బులు వసూలు చేశారు...? ఇలా పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.

కార్మిక భవన్‌లో క్యాంటీన్.. 'ఇండోర్'లో మకాం

- ప్రభుత్వ కార్యాలయాలు పరులపాలు
- యూపీ, ఎంపీ వాసులకు కట్టబెట్టిన టీడీపీ నేత
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- గ్రామస్తుల్లో ఆందోళన

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కంటికి కనిపించిన ప్రతి దానినీ తమ ఆదాయ వనరుగా టీడీపీ నేతలు మార్చుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ కార్యాలయాలను వదలడం లేదు. రూ. లక్షల వ్యయంతో విద్యార్థులు, ప్రజలకు ఉపయోగపడేలా మండల కేంద్రం రామగిరిలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలను స్థానిక ఓ టీడీపీ నేత కబ్జా చేసి పరుల పాలు చేశాడు. రామగిరి పరిసర ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్‌కు సంబంధించి 763 ఎకరాలను కేటాయించగా.. ఇందుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో భాగంగా ఆయా రైతుల జాబితాను అధికారులు సేకరించి ప్రభుత్వానికి అందజేశారు. టెకీ అనే సంస్థ సోలార్ ప్లాంట్ ఏర్పాటు పనులు చేపట్టింది. ఈ ప్రక్రియ మొత్తం స్థానిక ఓ టీడీపీ నేత కనుసన్నల్లోనే జరుగుతోంది. ఈ పనులకు యూపీ, ఎంపీ నుంచి వచ్చిన 40 మంది కూలీలు విడిది చేసేందుకు రామగిరిలోని ఇండోర్ స్టేడియం, కళాశాల గదులను అప్పగించాడు. అడిగేవారు లేరనే ధీమాతో కార్మిక భవన్‌లో అక్రమంగా క్యాంటీన్‌ను ఏర్పాటు చేయించాడు. దీంతో సమావేశాల నిర్వహణకు కార్మికులు ఇబ్బంది పడుతుండగా... పలు రకాల క్రీడల సాధనకు విద్యార్థులకు ఆటంకం కలుగుతోంది. ఇండోర్ స్టేడియం, కార్మిక భవన్‌కు సమీపంలోనే అగ్రి పాలిటెక్నిక్ కళాశాలతో పాటు మోడల్ స్కూల్ ఉంది. విద్యాసంస్థల పక్కగానే యూపీ, ఎంపీ వాసులు సంచరిస్తుండడంతో విద్యార్థినులను ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఏదైనా జరగరాని ఘటన జరిగితే బాధ్యులు ఎవరనే ఆందోళన గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది. వాస్తవానికి సోలార్ ప్లాంట్ పనులు జరిగే ప్రదేశంలోనే వారికి తాత్కాలిక విడిది చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వ కార్యాలయాలను కేటాయించడం ఏమిటనే వాదన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఇతర రాష్ట్రాల వాసులకు అప్పగించిన ప్రభుత్వ కార్యాలయాల్లో అసాంఘిక కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రశ్నించే వారు లేకపోవడంతో గ్రామస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలను ప్రజావినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


రామగిరిలోని కార్మిక భవన్‌లో క్యాంటీన్‌ను నిర్వహిస్తున్న దృశ్యం


రామగిరిలోని ఇండోర్ స్టేడియంలో గదులను యూపీ వాసుల మకాంగా మార్చిన దృశ్యం

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.10 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నర్శింగప్ప

పెనుకొండ: చోరీ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసి రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డీఎస్పీ నర్శింగప్ప తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. ఇటీవల పరిగి మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లల్లో జరిగిన దొంగతనాల దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు... డీఎస్పీ నర్శింగప్ప పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలుగా విడిపోయి దొంగల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రొద్దం మండలం శేషాపురం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు బోయ రాజును అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో చోరీలకు పాల్పడిన విషయాన్ని అంగీకరించాడు. కాగా, ప్రస్తుతం కర్ణాటకలోని మధుగిరి సమీపంలో ఉన్న తాడి గ్రామంలో నివాసముంటున్న రాజు.. తనకు సన్నిహితుడైన పరిగి మండలం ఊటుకూరుకు చెందిన చిన్నపరెడ్డితో కలసి కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడ్డాడు. చోరీ కేసుల్లో ఇప్పటికే చిన్నపరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పావగడ, బాగేపల్లి, గౌరీబిదనూరు, అరిసికెర, కొడిగేహళ్లి తదితర పీఎస్‌ల్లో వీరిపై కేసులు ఉన్నాయి. నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువైన 13 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసలు తెలిపారు. కాగా, నిందితుడి అరెస్టులో చొరవ చూపిన సీఐ రాఘవన్, ఎస్ఐ రంగడుయాదవ్, సిబ్బందిని ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వీరమ్మ

ముదిగుబ్బ: మాతాశిశు మరణాలను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేద్దామని వైద్య, ఆరోగ్య సిబ్బందికి డీపీహెచ్ఎన్ఓ డాక్టర్ వీరమ్మ పిలుపు నిచ్చారు. మంగళవారం ముదిగుబ్బ మండలం మలకవేముల పీహెచ్‌సీ పరిధిలోని సానేవారిపల్లి, కొండగట్టుపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికల్లో హిమోగ్లోబిన్ శాతాన్ని గుర్తించే పరీక్షలు నిర్వహించారు. గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యే వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాక్సినేషన్‌పై గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వేణుగోపాలరెడ్డి, పీహెచ్ఎన్ మంజుల, రవిశంకర్, అలివేలమ్మ, భార్గవి, పార్వతమ్మ, కృష్ణవేణమ్మ, ఆశా కార్యకర్తలు శాంతమ్మ, రాధమ్మ, గంగాదేవి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్థానికేతరుల భూములకు రక్షణ కల్పించండి

- సత్యసాయి భక్తురాలు గాయత్రి

పుట్టపర్తి టౌన్: విశ్రాంత జీవనం సత్యసాయి సన్నిధిలో గడపాలని నిర్ణయించుకుని పుట్టపర్తిలో స్థానికేతరులు కొనుగోలు చేసిన భూములకు రక్షణ లేకుండా పోయిందని హైదరాబాద్‌లో నివాసముంటున్న గాయత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పుట్టపర్తిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో పనిచేస్తున్న తాను తన శేష జీవితాన్ని సత్యసాయి సన్నిధిలో గడపాలని నిర్ణయించుకుని 2018లో సర్వే నంబర్ 356-1లోని లే అవుట్‌లో 5 సెంట్ల విస్తీర్ణమున్న 6వ ప్లాట్‌ను కొనుగోలు చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు వచ్చి చూస్తే స్థానికంగా ఉన్న రవీంద్ర, భారతి కబ్జా చేసినట్లుగా తెలిసిందన్నారు. ఈ విషయంగా అప్పట్లో కోర్టును ఆశ్రయించి ఇంజెక్షన్ ఆర్డర్ తీసుకొచ్చామని తెలిపారు. అయినా కబ్జాదారుల్లో మార్పు రాలేదని, పైగా తనపై దాడులు చేస్తూ చంపుతామని తరచూ బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఎస్పీ రత్నను కలసి వినతి పత్రం అందజేసి, న్యాయం చేయాలని అభ్యర్థించినట్లు వివరించారు.

కారు ఢీ - గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

ముదిగుబ్బ: మండల కేంద్రం సమీపంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద మంగళవారం సాయంత్రం గొర్రెల మందపై కారు దూసుకెళ్లడంతో ఆరు జీవాలు మృతి చెందినట్లు బాధిత కాపరి బాల వీరనారాయణ తెలిపాడు. జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొందన్నాడు. ఘటనతో రూ.80 వేల వరకు నష్టపోయినట్లు వాపోయాడు.

ఏపీఆర్ఎస్ జాతికి అంకితం : డీఈఓ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ క్రిష్టప్ప

పరిగి: పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పరిగి మండలం కొడిగెనహళ్లిలోని ఏపీఆర్ఎస్(ఏపీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల)ను జాతికి అంకితం చేస్తున్నట్లు డీఈఓ క్రిష్టప్ప వెల్లడించారు. మంగళవారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైజింగ్ ఇండియాకు ఎన్ఈపీ 2020 మూలస్తంభం లాంటిదని పేర్కొన్నారు. పీఎంశ్రీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు ల్యాబ్‌లు, ఇతర సౌకర్యాలను మెరుగు పరుస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మత్స్యరాజు, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, ఏపీసీ దేవరాజ్, సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంఓ డాక్టర్ అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

భర్తల ఆచూకీ తెలపండి

- విలేకరుల సమావేశంలో బాధిత మహిళలు



తమ భర్తలు కనిపించడం లేదని ఆధారాలు చూపుతున్న మహిళలు

ధర్మవరం: తమ భర్తలను 20 రోజుల క్రితం కిడ్నాప్ చేసి, అక్రమంగా నిర్బంధించారని, వారి ఆచూకీ తెలపకపోతే ఆత్మహత్య చేసుకుంటామని పోలీసులను ధర్మవరానికి చెందిన ఎస్.రేవతి, చట్టా రేవతి, దుర్గాలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ధర్మవరంలోని ఎర్రగుంట సమీపంలో ఉన్న సువర్ణ సిల్క్స్, సంగమేశ్వర సిల్క్స్‌లో తమ భర్తలు శ్రీధర్, శివకుమార్, సుకుమార్ పనిచేస్తున్నారన్నారు. ఈ నెల 11న రోజు వారీ పనిలో భాగంగా సిల్క్ హౌస్‌కు వెళ్లిన వారు నేటికీ ఇంటికి చేరలేదన్నారు. ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. అసలు తమ భర్తలు ప్రాణాలతో ఉన్నారా? లేదా అని అనుమానంగా ఉందన్నారు. వారికి ఏదైనా హాని జరిగితే పోలీసులదే బాధ్యత అని పేర్కొన్నారు. రేపటి (బుధవారం) లోపు తమ భర్తల ఆచూకీ తెలపకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంగా వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా.. సిల్క్ హౌస్‌లో నాలుగేళ్లగా పని చేస్తున్న శ్రీధర్, శివకుమార్, సుకుమార్ అక్కడ మెటీరియల్‌లో స్కామ్‌కు పాల్పడి దాదాపు రూ.90లక్షల వరకు యజమానిని మోసగించారని పేర్కొన్నారు. యజమాని ఫిర్యాదు మేరకు వారిపై చీటింగ్ కేసు నమోదు చేశామని, దీంతో వారు బెంగళూరుకు వెళ్లిపోయారని వివరించారు. అయితే రోజూ వారు... వారి భార్యలతో ఫోన్‌లో సంభాషిస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికే వారి కోసం బెంగళూరుకు ప్రత్యేక పోలీసు బృందాలు వెళ్లాయని, రెండు రోజుల్లో అరెస్ట్ చేసి ధర్మవరానికి తీసుకువస్తామని పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఆగస్టు 1, 2 తేదీల్లోనే పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఉన్న 2,60,156 పింఛన్లతో పాటు కొత్తగా మంజూరైన 4,509 వితంతు పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఇందులో 2019, ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జూలై వరకు పింఛన్ పొందుతున్న కుటుంబ యజమాని మృతి అనంతరం ఆయన భార్యకు వితంతు పింఛన్‌ను అందజేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

పీఏల వేధింపులు.. సెలవులో సీఐ..!

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గంలో పనిచేస్తున్న ఓ సీఐ సెలవుపై వెళ్లిపోయారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు తీవ్రంగా అవమానించడంతో మనస్థాపం చెంది సెలవుపై వెళ్లారన్న చర్చ హిందూపురంలో సాగుతోంది. వివరాల్లోకి వెళితే... రెండురోజులు క్రితం హిందూపురం పట్టణానికి చెందిన ఓ టీడీపీ నేత కుమారులిద్దరు పట్టణంలో పోలీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. దీంతో వారిపై టూ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే తాను పార్టీ కోసం కష్టపడితే... తన బిడ్డలపై కేసు నమోదు చేశారని సదరు టీడీపీ నేత ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర వద్ద వాపోయినట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పీఏలు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఆంజనేయులుకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమకు చెప్పకుండా టీడీపీ నేత కుమారులపై కేసు ఎలా నమోదు చేశావని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తప్పు చేసిన వారిని బాలకృష్ణ పీఏలు వెనకేసుకురావడంతో పాటుగా నిజాయితీగా పనిచేసిన తనపైనే ఆగ్రహించడంతో సీఐ ఆంజనేయులు మనస్థాపం చెంది సెలవులో వెళ్లిపోయినట్టు తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పీడీ రోజా

అమరాపురం: ఆగస్టు 11వ తేదీన బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అమరాపురం మండలం హాలుకూరు గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ మేరకు పీడీ రోజా మంగళవారం వెల్లడించారు. అనంతపురం పీటీసీ మైదానంలో సోమవారం అండర్ 16, 18 విభాగాల్లో నిర్వహించిన పరుగు పందెంలో పాఠశాలకు చెందిన వరలక్ష్మి, అశ్వని (3వేల మీటర్లు), లక్ష్మీభయ్యా, వరలక్ష్మి (200 మీటర్లు), ప్రియాంక (వెయ్యి మీటర్లు), రోష్నిబాయి (400 మీటర్లు) రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. అలాగే షాట్‌పుట్‌లో షాట్ పుట్‌లో కోవెల, స్వప్న, జావెలిన్ త్రోలో గుణశ్రీ ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థినులను మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.